గిరిజనుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి
జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్

మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్

అశ్వారావుపేట/ అశ్వారావుపేట రూరల్, మార్చి 18 : ఆదివాసీ గిరిజనులకు సేవ చేసుకునే అవకాశం దక్కడం అధికారుల అదృష్టమని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. మంగళవారం అశ్వారావుపేట మండలంలోని కావడిగుండ్ల, గాండ్లగూడెం గ్రామంలో పర్యటించి గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు తమ సమస్యలను www.ncst.nic.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు. దమ్మపేటలో మినీ ఐటీడీఏ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని పీవోకు సూచించారు. ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ కావడిగుండ్ల గ్రామంలో 60మంది గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వటం జరిగిందన్నారు. జేవీఆర్ ట్రస్టు చైర్మన్, మాజీ మంత్రి జలగం ప్రసాదరావు, డీఎఫ్‌వో దామోదర్‌రెడ్డి, ఎన్పీడీసీఎల్ ఎస్సీ మహేందర్, డీడీ ట్రైబుల్ వేల్ఫర్ అధికారి మణేమ్మ, తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, విద్యుత్, ఐటీడీఏ డీఈఈలు వెంకటరత్నం, బాపనయ్య, ఏఈలు, వివిధశాఖల అధికారులు, మాజీ సర్పంచచులు, గిరిజనులు పాల్గొన్నారు.

'సీతారామ' నీటిని ఏజెన్సీ ప్రాంతాలకు ఇవ్వాలి

సీఎంకి వినతిపత్రం ఇస్తున్న గుమ్మడి, కోరం

ఇల్లెందు, మార్చి 18: సీతారామ ప్రాజెక్టు నీటిని ఇల్లెందు నియోజకవర్గంతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతాలకు పూర్తి స్థాయిలో ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని అఖిలపక్ష నాయకులు కోరారు. మంగళవారం ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఆధ్వర్యంలో అఖిలపక్ష నాయకులు అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. సీఎం స్పందిస్తూ ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఉమ్మడి ఖమ్మంజిల్లా అఖిలపక్షంతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడాలని ఆదేశించారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలి

ఆయకట్టును పరిశీలిస్తున్న ఈఈ రాంప్రసాద్

దుమ్ముగూడెం, మార్చి 18: తాలిపేరు కెనాల్ జోన్ రెండో పరిధిలోని చివరి ఆయకట్టు పొలాలకు సాగునీరు అందించాలని ఈఈ రాంప్రసాద్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అచ్చుతాపురం, గంగోలు గ్రామాల్లోని జోన్ రెండులో పంట పొలాలను ఆయన పరిశీలించారు. చివరి భూములకు సాగునీరు అందించాలని, పంటలు ఎండిపోకుండా చూసేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీఈ ఎస్.మధుసూదన్‌రావు, జేఈలు తాజ్‌సురాజ్, హర్ష పాల్గొన్నారు.

పరిశోధనల్లో విద్యార్థులను భాగస్వామ్యం చేయాలి

ఇల్లెందు రూరల్, మార్చి 18 : అధ్యాపకులు నిరంతరం అనేక అంశాలపై చేస్తున్న పరిశోధనల్లో విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వై.చిన్నప్పయ్య అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టరేట్ పొందిన తెలుగుశాఖ సహాయ అచార్యులు పగిడిపల్లి వెంకటేశ్వర్లును శాలువా కప్పి సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావు, డాక్టర్లు శ్రీదేవి, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, శ్రీరామ రాకేష్, రాజు, కృష్ణవేణి, సరిత, సురేందర్, ఈశ్వర్, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

ఇల్లెందు రూరల్, మార్చి 18: కులాంతర వివాహం చేసుకున్న ప్రేమజంట ఇల్లెందు పోలీసులను ఆశ్రయించారు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం కల్వల గ్రామం ఎస్సీ కులానికి చెందిన కందిపాటి తరుణ్, అదే గ్రామంలో ఎస్టీ లంబాడా కులానికి చెందిన ధరావత్ మమత కొన్ని సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. అమ్మాయి తల్లిదండ్రులు, అన్నదమ్ములు వివాహానికి అంగీకారం తెలపకపోవడంతో ఇల్లెందు మండలం చెరువుకట్ట ప్రాంతంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో వివాహం చేసుకున్నారు. తమకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని మమత లిఖితపూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఎండిపోతున్న మొక్కజొన్న పైర్లు
తీవ్రంగా నష్టపోతున్న కౌలు రైతులు

ఎండిన మొక్కజొన్న పైరును చూపిస్తున్న కౌలు రైతు

చండ్రుగొండ, మార్చి 18: సాగునీరు లేక మొక్కజొన్న పంటలు ఎండిపోతున్నాయి. ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి సాగు చేసిన పంట కండ్ల ముందే ఎండిపోతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. చండ్రుగొండ మండలంలోని దామరచర్ల గ్రామానికి చెందిన రైతు కర్రి రామకృష్ణ ఒక్కో ఎకరానికి రూ.20 వేల చొప్పున చెల్లించి ఐదెకరాల భూమిని కౌలుకు తీసుకున్నాడు. అందులో యాసంగి పంటగా మొక్కజొన్న సాగు చేశాడు. బోరు బావి నీరు సరిపోకా మొత్తం మొక్కజొన్న పైరు ఎండిపోయింది. రెండునెలలపాటు సాగు చేసిన పంట కండ్లఎదుటే ఎండిపోవడంతో బోరున విలపిస్తున్నాడు. ఎకరానికి రూ.60 వేల వరకు పెట్టుబడులు పెట్టానని ఆవేదన వ్యక్తంచేశాడు. సాగునీరు అందించి ఉంటే పంటలు ఎండిపోయేవి కావని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశాడు.

కంటి సమస్యలపై నిర్లక్ష్యమొద్దు

పాల్వంచ రూరల్, మార్చి 18 : కంటి సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకుండా వెంటనే డాక్టర్లను సంప్రదించాలని గ్లకోమా కన్సల్టెంట్ స్పెషలిస్ట్ డాక్టర్ సిద్దార్థ దీక్షిత్ అన్నారు. పట్టణంలోని నవభారత్ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 40ఏండ్లు పైబడిన వారు కంటి పరీక్షలు చేయించుకోవడం వలన ఈ వ్యాధి బయట పడుతుందని, కంటి నరంలో వత్తిడి ఎక్కువై చూపు మందగిస్తుందన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

మణుగూరు టౌన్ : అరెస్టు అయిన బీఆర్ఎస్ నేతలు

ఇల్లెందు: బీఆర్ఎస్వీ నాయకులు

మణుగూరు టౌన్, మార్చి 18: రానున్న రోజుల్లో పినపాక నియోజకవర్గంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం భారీ సమావేశం నిర్వహించనున్నారు. అసెంబ్లీ ముట్టడి పిలుపు మేరకు ముందస్తు అరెస్టులో భాగంగా పినపాక విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు తాళ్లపల్లి రాహుల్‌గౌడ్, దుర్గ, దీపక్, దినేష్, చింటూ, భరత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. విద్యార్థుల గొంతు నొక్కాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో తగిన గుణపాఠం తప్పదని, విద్యాశాఖకు మంత్రి లేకపోవడం ప్రభుత్వ వైఫల్యమని అన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలను ప్రజల ముందు నిలదీస్తామన్నారు.

బీఆర్ఎస్వీ నాయకుల అరెస్టు

ఇల్లెందు, మార్చి 18 : బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి హైదరాబాద్ వెళ్తున్న నాయకులను ఇల్లెందు పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసుల అదుపులో ఉన్న బీఆర్ఎస్వీ నాయకులు గిన్నారపు రాజేశ్, సత్తాల హరికృష్ణ, చంద్ పాషా మాట్లాడుతూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తుండగా పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకోవడం సరికాదన్నారు. ప్రతీ చిన్న విషయానికి పోలీసులు అదుపులోకి తీసుకొని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సుమారు గంటపాటు వారిని పోలీస్‌స్టేషన్‌లో ఉంచి అనంతరం విడిచిపెట్టారు.

స్టోర్ బియ్యాన్ని తరలిస్తున్న ముఠాను శిక్షించాలి : బీఆర్ఎస్

మణుగూరు టౌన్, మార్చి 18: మణుగూరు నుంచి స్టోర్ బియ్యాన్ని తరలిస్తున్న ముఠాలకు అడ్డుకట్ట వేయాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. తరచూ మణుగూరు నుంచి వెళ్తున్న స్టోర్ బియ్యం పట్టుబడుతున్నాయని, అందులో భాగంగా సోమవారం కూడా అశ్వాపురంలో స్టోర్ బియ్యం పట్టుకున్నారని గుర్తు చేశారు. కుంట లక్ష్మణ్, బొలిశెట్టి నవీన్, నూకారపు రమేష్, వట్టం రాంబాబు, తాళ్లపల్లి యాదగిరి గౌడ్, ముద్దంగుల కృష్ణ, అక్కి నరసింహారావు, ఆవుల నరసింహారావు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

మణుగూరు టౌన్, మార్చి 18: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు, ఉద్యమకారుడు ఎడ్ల శ్రీనివాస్ ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే కల్యాణలక్ష్మీ పథకం ద్వారా అదనంగా ఇస్తానన్న తులం బంగారం అందించి మాటను నిలబెట్టుకోవాలని అన్నారు. చెప్పిన విదంగా హామీలు నెరవేర్చాలి కానీ.. బీఆర్ఎస్‌ను తిడితే హామీలు అమలవుతాయా అని ప్రశ్నించారు.

నిరుద్యోగులకు న్యాయం చేయాలి

పాల్వంచ రూరల్, మార్చి 18 : రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయంచేయాలని బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం పట్టణ అధ్యక్షుడు జూపెల్లి దుర్గాప్రసాద్ అన్నారు. పాల్వంచ పట్టణంలో మంగళవారం జరిగిన బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాత పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పేరు పెట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన హామీలు ఏ ఒక్కటీ అమలు జరగడంలేదని, ఇప్పటికైనా చిత్తశుద్ధితో నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రామారావు, గౌతమ్, పవన్, సోను, వలి, అఖిల, మహర్షి, నాని పాల్గొన్నారు.

'తరగతి గది స్నేహం జీవితాంతం'

ఉపాధ్యాయులతో కలిసి పదో తరగతి విద్యార్థులు

అశ్వారావుపేట టౌన్, మార్చి 18 : బాల్యంలో ఏర్పడిన స్నేహం జీవితాంతం గుర్తుంటుందని, తరగతి గదిలో ఏర్పడిన స్నేహం మరింత బలంగా ఉంటుందని ప్రధానోపాధ్యాయురాలు పి.హరిత అన్నారు. మంగళవారం అశ్వారావుపేట జడ్పీ బాలుర హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ వార్షిక పరీక్షలకు పదో తరగతి విద్యార్థులు భయపడకుండా హాజరుకావాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదవాలని, స్నేహం ఎప్పుడూ గొప్పదని స్నేహాన్ని వదులుకోవద్దని అన్నారు.

ఎరువు తయారీపై అవగాహన

మాట్లాడుతున్న హేమలత

ఇల్లెందు, మార్చి 18 : మున్సిపాలిటీల పరిధిలో సిబ్బందికి తడి, పొడి చెత్త వేరు చేయడం, వర్మీకంపోస్టు ఎరువు తయారీపై మంగళవారం అవగాహన కల్పించారు. ఇల్లెందు మున్సిపాలిటీ డీఆర్‌సీసీ భవనంలో ఇల్లెందు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ అధ్యక్షతన ఇల్లెందు, కొత్తగూడెం, సత్తుపల్లి, పాల్వంచ, దోర్నకల్, మహబూబాబాద్, తొర్రూర్ మున్సిపాలిటీలకు చెందిన అధికారులు, సిబ్బందికి ఒక రోజు శిక్షణ జరిగింది. హైదరాబాద్ నుంచి వచ్చిన సీడీవో హేమలత తడిపొడి చెత్తను వేరుచేసి ఎరువుగా మార్చే విధానం, తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై వివరించారు. వ్యర్థాల ద్వారా ఎరువు తయారుచేసి పురపాలక ఆదాయాన్ని పెంచాలని, పురపాలక పరిధిలో ఉన్న చెట్లకు ఈ ఎరువును వాడి ఖర్చు తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు రవిందర్‌యాదవ్, శాంతకుమార్, ఉదయ్‌కుమార్, కుమారస్వామి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గులాబీ యువసైన్యం కమిటీ ఏకగ్రీవం

మణుగూరు టౌన్, మార్చి 18 : బీఆర్ఎస్ పార్టీ నిర్మాణంలో భాగంగా గులాబీ యువసైన్యం మణుగూరు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మణుగూరు పట్టణాన్ని నాలుగు ఏరియాలుగా విభజించి నలుగురు అధ్యక్షులు, ఒక మండల అధ్యక్షుడిని ప్రకటించినట్లు పేర్కొన్నారు. మండల అధ్యక్షుడిగా బోశెట్టి రవి, ఏరియా అధ్యక్షులుగా గుర్రం సృజన, ఆవుల శ్రీనివాస్, పెండ్యాల శ్రీధర్, గాజుల కార్తీక్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు.

నవమికి ముస్తాబవుతున్న పర్ణశాల

ఆలయానికి రంగులు వేస్తున్న దృశ్యం

పర్ణశాల, మార్చి 18: శ్రీరామనవమి ఉత్సవాల కోసం పర్ణశాల ఆలయం ముస్తాబవుతోంది. ఏర్పాట్లలో భాగంగా ముందుగా పర్ణశాల ఆలయ ప్రధాన గోపురం ముఖ మండపం, రాజగోపురం ఎదురుగా ఉన్న ఆర్చీ గేట్, పర్ణశాల ప్రవేశ మార్గంలో ఉన్న మెయిన్ ఆర్చి గేట్, కుటీరం వద్ద ఏర్పాటు చేసిన బొమ్మలకు పంచరంగులు వేసే పనిని పూర్తి చేశారు. విద్యుద్దీపాలంకరణ, తాత్కాలిక పందిళ్లు, తాత్కాలిక ప్లేవుడ్ ఆర్చి గేట్లు పనులకు ఇప్పటికే టెండర్లు ఖరారు చేసి వర్క్ ఆర్డర్‌లు జారీ చేసి ఉన్నారు. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేసి ఉత్సవాలు ప్రారంభం నాటికి పూర్తి స్థాయిలో పూర్తి చేస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

సింగరేణి పాఠశాలలు ఉన్నత ప్రామాణాలకు నిలయాలు : జీఎం

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న జీఎం రాంచందర్

మణుగూరు టౌన్, మార్చి 18: మణుగూరు ఏరియా పీవీ కాలనీ సింగరేణి పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఏరియా జీఎం దుర్గం రాంచందర్, డీజీఎం పర్సనల్ రమేష్ పాల్గొని మాట్లాడుతూ.. సింగరేణి పాఠశాలలు ఉన్నత ప్రామాణాల విద్యకు నిలయాలు అని, యాజమాన్యం ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా విద్యార్థులకు సకల సౌకర్యాలతో పాటు వైజ్ఞానిక, సృజనాత్మకతతో కూడిన ఉన్నత విద్యను బోధిస్తుందన్నారు.

పోక్సో కేసు నమోదు

టేకులపల్లి, మార్చి 18 : బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తిపై టేకులపల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం పోక్సో కేసు నమోదైంది. ఎస్సై పోగుల సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో బాలికపై వ్యక్తి అత్యాచారం చేసినట్లు బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రామయ్యకు వైభవంగా కల్యాణం

భద్రాచలం, మార్చి 18: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి వారికి మంగళవారం సందర్భంగా రామాలయం ఆవరణలో ఉన్న దాసాంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామివారి నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణదారణ, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనాన్ని వైదిక సిబ్బంది నిర్వహించారు. ఈ సేవల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పిల్లల కలలకు రూపాన్ని ఇవ్వండి : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కొత్తగూడెం గణేష్ టెంపుల్, మార్చి 18 : పిల్లల కలలకు, వారి ఊహాశక్తికి సరైన ప్రోత్సాహాన్ని అందిస్తే వారి భవిష్యత్తు బంగారుమయం అవుతుందని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. జిల్లాస్థాయి బాలమేళా ముగింపు ఉత్సవంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో తీసుకున్న వినూత్న కార్యక్రమం బాలమేళా విజయవంతం పట్ల ఆనందం వ్యక్తంచేశారు. పిల్లల అభ్యాసన అభివృద్ధి మెరుగుపడటంలో ఉపాధ్యాయులు అద్భుతమైన కృషి చేశారని పేర్కొన్నారు. కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఐదుగురు ఎంఈవోలు, రీసోర్స్‌పర్సన్లను సన్మానించారు. డీఈవో వెంకటేశ్వరచారి, నాగరాజశేఖర్, సతీష్, సైదులు, ఎంఈవోలు పాల్గొన్నారు.

గిరిజన కళాశాలను సందర్శించిన న్యాయమూర్తి

విద్యార్థినులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి

భద్రాచలం, మార్చి 18: భద్రాచలంలోని ప్రభుత్వ గిరిజన బాలికల జూనియర్ కళాశాలను భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వి.శివనాయక్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని సమస్యలను అక్కడి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు, తరగతి గదులు, డార్మెటరీ గదులు, మంచినీటి సౌకర్యం పరిశీలించిన న్యాయమూర్తి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఉద్యోగుల శ్రేయస్సు కోసం కృషి : ఎస్ఈ

లక్ష్మీదేవిపల్లి, మార్చి 18 : విద్యుత్ ప్రమాదాల పట్ల ఓఅండ్ఎం ఉద్యోగులకు అవగాహన కల్పిస్తూ వారి శ్రేయస్సు కోసం పాటుపడుతున్నామని కొత్తగూడెం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ మహేందర్ మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఓఅండ్ఎం ఉద్యోగులు భద్రత పట్ల అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎప్పటికప్పుడు సూచనలు జారీ చేస్తూ వారికి భద్రత పరికరాలు అందజేస్తున్నామని తెలిపారు. నిరంతర శిక్షణ, భద్రత పద్ధతులను బలోపేతం చేయడం వల్ల భద్రతా ప్రమాణాలను పెంచగలుగుతున్నామన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమతంగా ఉండాలి

అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ చంద్రభాను

టేకులపల్లి, మార్చి 18 : ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, ప్రజలు అప్రమతంగా ఉండాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను అన్నారు. మంగళవారం టేకులపల్లి మండల కేంద్రం సింగరేణి హైటెక్ కాలనీలో సీఐ తాటిపాముల సురేష్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

ఇల్లెందు, మార్చి 18 : ఇల్లెందు పట్టణం ఎస్సై సందీప్‌కుమార్ గ్రూప్ వన్‌లో 502 మార్కులతో మంచి ర్యాంకు సాధించినందుకు ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను సన్మానించారు. మంగళవారం డీఎస్పీ కార్యాలయంలో సీఐ బి.సత్యనారాయణతో కలిసి సన్మానించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు

మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

అన్నపురెడ్డిపల్లి, మార్చి 18: శాంతిభద్రత పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఎర్రగుంటలో నిర్వహించిన సమావేశంలో ఆయన ఫ్రెండ్లీ పోలీసింగ్, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. నేరాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీఎం రేవంత్‌రెడ్డి దుర్మార్గ రాజకీయాలు చేస్తున్నారు

భద్రాచలం, మార్చి 18: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీరణ పేరుతో దుర్మార్గ రాజకీయాలు చేస్తున్నారని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి శేఖర్ ఆరోపించారు. భద్రాచలంలో మంగళవారం మాలమహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో తీర్మానం పెట్టడాన్ని నిరసిస్తూ నిరసన చేపట్టారు. చిట్టిబాబు, రమేష్, రామకృష్ణ, రవి, శ్రీను, కుమార్, మహర్షి, కిరణ్, దేవరాజు, పాపారావు పాల్గొన్నారు.

పాఠశాలలో మందుబాబుల వీరంగం

లక్ష్మీదేవిపల్లి, మార్చి 18: మండలంలోని హేమచంద్రాపురం ప్రాథమిక పాఠశాలలో తాగుబోతులు వీరంగం సృష్టించారు. పాఠశాల తలుపులు పగలగొట్టి పుస్తకాలు చిందరవందరగా పడేశారు. తాగుబోతులకు పోలీసులు కౌన్సిలింగ్ ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

బీసీ గురుకులాల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తులు

టేకులపల్లి, మార్చి 18 : మహాత్మా జ్యోతి బాపులే రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో 2025-26 విద్యాసంవత్సరానికి గాను బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టేకులపల్లి బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రవీందర్ తెలిపారు. మంగళవారం బీసీ గురుకుల పాఠశాలలో ఆయన మాట్లాడుతూ బీసీ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6, 7, 8, 9వ తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ(ఈబీసీ)లకు చెందిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు, మార్చి 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 20 ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరచిన వారిని రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేస్తామని తెలిపారు. వెబ్‌సైట్ WWW.mjptbcw reis. telangana. gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నిరుద్యోగ సమస్యపై పోరాడాలి

ఇల్లెందు రూరల్, మార్చి 18 : భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ స్ఫూర్తితో నిరుద్యోగ సమస్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాడాలని పీవైఎల్ మండల కార్యదర్శి మోతీలాల్ అన్నారు. మంగళవారం ఇల్లెందు మండల పీవైఎల్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుంజ కిశోర్, జోగా కృష్ణ, లక్ష్మణ్, మాధవ్, భావ్‌సింగ్, విజయ్, రమేష్, రమణయ్య పాల్గొన్నారు.

పశువుల వ్యాన్ పట్టివేత

అశ్వారావుపేట, మార్చి 18 : పశువులను అక్రమంగా తరలిస్తున్న వ్యాన్‌ను సోమవారం అర్ధరాత్రి స్పెషల్ బ్రాంచ్ పోలీసులు పట్టుకున్నారు. ఏపీలోని విజయనగరం జిల్లా అలమంద సంత మార్కెట్‌లో కొనుగోలు చేసిన 8 ఆవులు, 4 ఎద్దులను అనుమతులు లేకుండా హైదరాబాద్ కబేళాకు తరలిస్తున్నారు. అశ్వారావుపేట రింగ్‌రోడ్డు సెంటర్‌లో తనిఖీలు చేస్తున్న స్పెషల్ బ్రాంచ్ పోలీసులు వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పశువులను పాల్వంచ గోశాలకు తరలించారు. వ్యాన్ డ్రైవర్ యజమాని ఓర్సు శ్రీను, క్లీనర్ అల్లపు వెంకటేష్‌తోపాటు దళారీ మానేపల్లి ఎల్లయ్యపై మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యయాతి రాజు తెలిపారు.

జీవో 64ను రద్దు చేయాలి

ఇల్లెందురూరల్, మార్చి 18 : డైలీవేజ్ వర్కర్ల వేతనాలు తగ్గించే జీవో నెంబర్ 64ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నభి అన్నారు. మంగళవారం సమ్మెలో భాగంగా గుండాల, ఆళ్ళపల్లి మండలాల్లో గల ఆశ్రమ పాఠశాలలో పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనాల గెజిట్ ప్రకారమే వేతనాలు చెల్లించాలన్నారు. కార్మికుల హక్కులను కాలరాసే జీవో 64ను నిలిపివేయాలన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

పాల్వంచ రూరల్, మార్చి 18 : పాల్వంచ పట్టణంలోని భజన మందిరంలో గల శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ హుండీ లెక్కింపు మంగళవారం జరిగింది. గత ఏడాది మార్చి 19వ తేదీన హుండీ లెక్కింపు జరిగింది. అప్పటి నుంచి ఈ నెల 18వ తేదీ వరకు భక్తులు హుండీలో వేసిన కానుకలను లెక్కించారు. సంవత్సరానికి రూ.70,558 ఆదాయం లభించింది.

విద్యార్థులకు పెన్నులు, ప